అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జగిత్యాల రూరల్ మండల కార్యదర్శులు

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 27: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర అత్యంత కీలకమని, సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల పనితీరుతోనే స్వచ్ఛ సర్వేక్షన్‌లో జిల్లా, జాతీయ స్థాయిలో అవార్డులు గెలుచుకున్నామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండల పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రెండో సారి విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామాల్లో పల్లె ప్రకృతివనం, వైకుంఠధామాల నిర్మాణం, వర్మి కంపోస్టు షెడ్ వంటి వాటిని నిర్మించామన్నారు. హరితహారం ద్వారా పచ్చదనం, పరిశుభ్రతలో తెలంగాణ పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కరోనా సమయంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను పటిష్ఠంగా అమలు చేస్తూ, కరోనా వ్యాప్తి చెందకుండా అవగాహన కార్యక్రమాలను చాలా చక్కగా నిర్వహించారని కొనియాడారు. పంచాయతీ కార్యదర్శుల వేతనాన్ని రూ.15 వేల నుంచి రూ.29వేలకు పెంచిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాల్సిన బాధ్యత తను ప్రజాప్రతినిధులతో పాటు పంచాయతీ కార్యదర్శులు సైతం తీసుకోవాలన్నారు. కాగా జగిత్యాలలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై. సత్యనారాయణ, అధ్యాపక బృందం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలి సి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మెట్‌పల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
- మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు హాజరు

మెట్‌పల్లి/కోరుట్ల, డిసెంబర్ 27: తమ, పర భేదం లేకుండా రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరం కలిసి కట్టుకట్టుగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. బుధవారం మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు ఎమ్మెల్యే సంజయ్ హాజరయ్యారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారిగా కౌన్సిల్ సమావేశాలకు హాజరైన డాక్టర్ సంజయ్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు ఘన స్వాగతం పలికారు. సత్కరించి అభినందనలు తెలిపారు. కాగా మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన, అలాగే కోరుట్ల మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన నిర్వహించారు. ఆయా సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. నేటి నుంచి ప్రారంభించే ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారెంటీలకు సంబంధించి వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. అనంతరం మెట్‌పల్లిలో 21 అంశాలకు సంబంధించిన ఎజెండాను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే కోరుట్లలో 30 ఎజెండా అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మెట్‌పల్లిలో మున్సిపల్ ఉపాధ్యక్షుడు బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, డీఈఈ రాజ్‌కుమార్, కోరుట్లలో మున్సిపల్ కమిషన్ రాజేశ్వర్, డీఈఈ అభినయ్, ఏఈ లక్ష్మి, టీపీవో ప్రవీణ్, టీపీఎస్ రమ్య, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కనుల పండువగా అయ్యప్ప పడిపూజ

కోరుట్ల : అయ్యప్ప పడిపూజకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

కోరుట్ల, డిసెంబర్ 27: పట్టణంలోని అయ్యప్ప గుట్టపై వెలిసిన జ్ఞానసరస్వతీ మాత, శనైశ్చర సహిత అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అష్టోత్తర కలశ సామూహిక మహ పడి పూజ, అయ్యప్ప జాతరను కనుల పండుగగా నిర్వహించారు. 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అర్చకులు పాలెపు రామకృష్ణశర్మ, వినయ్‌శర్మ వైదిక నిర్వహణలో స్వామి వారికి సుప్రభాతం, పంచామృతాభిషేకాలు, మహాహారతి, గణపతి హవనం, పడిపూజ, భజన కార్యక్రమాలు వైభవంగా జరిపించారు. ప్రత్యేకంగా తయారు చేసిన తిరుణాభరణాలను స్వామి మూలవిరాట్టుకు అలంకరించి ఆలయం చుట్టూ రథోత్సవం నిర్వహించి, మహిషాసుర సంహారం చేపట్టారు. అంతకుముందు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప గురుస్వాములు పదునెట్టంబడి 18 మెట్లకు మెట్ల పూజ చేసి పడి వెలిగించారు. అనంతరం భక్తులకు అన్నదానం ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారమందిస్తానని ఎమ్మెల్యే సంజయ్ భక్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు చిద్రాల నారాయణ గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప జాతర

జగిత్యాల, డిసెంబర్ 27: జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం అయ్యప్పజాతర ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పడిపూజ నిర్వహించి, మహిసాసురా సంహారం నిర్వహించారు. అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహించారు.

ప్రజాపాలన సమీక్షకు జడ్పీ చైర్మన్లకు అందని ఆహ్వానం

- సన్నాహక శిబిరానికి ఆహ్వానించకపోవడంపై విమర్శలు

జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, డిసెంబర్ 27: ప్రజాపాలన అభయహస్తం సన్నాహక సమావేశానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు జిల్లాలకు సంబంధించిన జిల్లా పరిషత్ చైర్మన్లను ఆహ్వానించకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ప్రజా పాలన, అభయహస్తం పథకాల అమలుకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. ప్రజా పాలనను విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు రాష్ట్ర నీటి పారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించింది. ఉత్తమ్ కుమార్‌రెడ్డి బుధవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, ఎస్పీలు హాజరయ్యా రు. కాగా సమావేశానికి డిప్యూటీ క్యాబినెట్ ర్యాంక్‌లో ఉన్న జడ్పీ చైర్‌పర్సన్లను ఆహ్వానించకపోవడం చర్చనీయాంశంగా మా రింది. జిల్లా పరిధిలోని జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు బీఆర్ఎస్‌కు చెందిన వారు చైర్మన్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నలుగురికి ఆహ్వానం అందకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ ప్రజాస్వామ్యం, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై నిరంతరం మాట్లాడుతున్న ఆచరణలో మాత్రం ఆ విలువలను పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో స్థానిక సంస్థల్లో కీలకమైన స్థానంలో ఉన్న ప్రజాప్రతినిధులైన జడ్పీ చైర్మన్లను ప్రజాపాలన లాంటి, ప్రజా సంబంధిత కార్యక్రమాల అమలు సన్నాహక సమావేశానికి ఆహ్వానించకపోవడం ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనమని ఆరోపించారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై అవిశ్వాసం

- ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేసిన ఎంపీటీసీలు

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 27: ఇబ్రహీంపట్నం ఎంపీపీ జాజాల బీమేశ్వరి, వైఎస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డిపై అవిశ్వాసం ప్రకటిస్తూ బుధవారం ఇబ్రహీంపట్నం ఎంపీటీసీలు మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయంలో అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీపీ జాజాల బీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి అవినీతికి పాల్పడడమే కాకుండా ప్రజలకు పరిపాలన అందించడం లేదని వారు ఆరోపించారు. ఎనిమిది మంది బీఆర్ఎస్ సభ్యులు, ఒక బీజేపీ సభ్యురాలు మొత్తం 9మంది తీర్మాన పత్రాన్ని అందించారు. మొత్తం 12 మంది సభ్యులకు గానూ 9 మంది సభ్యులు క్యాంపునకు బయలుదేరినట్లు సమాచారం. ఎంపీపీ, వైస్ ఎంపీపీపై అవిశ్వాసాన్ని ప్రకటించడం మండలంలో చర్చనీయమైంది.

కేడీసీసీ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కథలాపూర్, డిసెంబర్ 27: కేడీసీసీ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ రఘునాథ్‌శర్మ అన్నారు. మండలంలోని భూషన్‌రావుపేటలో బుధవారం బ్యాంక్ ప్రత్యేక వడ్డీలు, పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార క్రాంతి పథకంలో 546 రోజులపాటు డిపాజిట్ చేసిన డబ్బుకు 7.5 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్స్‌కు 8 శాతం వడ్డీ చెల్లిస్తామని తెలిపారు. తక్కువ వడ్డీకే వ్యాపారులకు రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శివకుమార్, సర్పంచ్ కూన సులోచన, శ్రీనివాస్, రాజేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శంకర్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

గొల్లపల్లి, డిసెంబర్ 27: మండలంలోని మల్లన్నపేట మల్లికార్జున స్వామి (దొంగ మల్లన్న) జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. షష్ఠి ఏడు వారాల జాతర ఉత్సవాల్లో భాగంగా మూడో వారమైన బుధవారం స్వామిని 13 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఏర్పాట్లను పరిశీలించారు. పట్నాలు, ప్రత్యేకదర్శనం, గండదీపం టికెట్ల అమ్మకం ద్వారా రూ.59,780 ఆదాయం వచ్చినట్లు ఫౌండర్, ట్రస్టీ శాంతయ్య, ఈవో విక్రమ్ తెలిపారు.

అవయవ దానంతో సజీవం

- ఐదుగురికి ప్రాణం పోసిన మహిళ

కోరుట్ల, డిసెంబర్ 27: ఓ మహిళ తాను చనిపోతూ మరో ఐదుగురికి వెలుగునిచ్చింది. రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన ఆమె అవయవాలను కుటుంబసభ్యులు దానం చేసి స్ఫూర్తిగా నిలిచారు. కోరుట్ల మున్సిపల్ అనుబంధ గ్రామం ఎఖీన్‌పూర్‌కు చెందిన చాడ శ్రీనివాస్ గుప్తా ఆదివారం తన భార్య, ఇద్దరు కూతుళ్లతో కలిసి బైక్‌పై వెళ్తున్నారు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కింద పడ్డారు. కాగా భార్య సంధ్యారాణి (40) తలకు తీవ్ర గాయమైంది. స్థానికుల సాయంతో కోరుట్లలోని ప్రభుత్వ దవాఖానకు, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ డెడ్ అయిందని నిర్ధారించారు. సంధ్యారాణి ఇక బతుకదని వైద్యులు తేల్చి చెప్పడంతో సంధ్యారాణి భర్త శ్రీనివాస్ అవయదానానికి ముందుకు వచ్చాడు. యశోద ఆసుపత్రి వైద్యబృందం ఆమె కళ్లు, కిడ్నీలు, గుండె, లివర్ అవయవాలను సేకరించింది.

మున్సిపల్ సాధారణ సమావేశం

రాయికల్, డిసెంబర్ 27: మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్యసమావేశం చైర్మన్ మోర హన్మాండ్లు అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశంలో పారిశుద్య నిర్వహణ, నీటి సరఫరా సమస్యలు, అదనపు కార్మికుల వేతనాల గురించి కౌన్సిలర్లు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని చైర్మన్ తెలిపారు. 25 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఉచితంగా ఫ్యాషన్ శిక్షణ

జగిత్యాల రూరల్, డిసెంబర్27: జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్లలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన స్పందన ఎన్‌జీవో, నాబార్డ్ ఆధ్వర్యంలో ఉచిత ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ తరగతులను ప్రారంభించారు. 15రోజుల శిక్షణ కాలంలో భోజనం, గౌరవభత్యం, శిక్షణ పూర్తయ్యాక ధ్రువీకరణ పత్రం అందిస్తామని నాబార్డ్ డీడీఎం మనోహర్‌రెడ్డి, స్పందన సంస్థ ఆర్గనైజర్ శోభారాణి తెలిపారు.

నేడు జూనియర్ నెట్‌బాల్ ఎంపిక పోటీలు

జగిత్యాల, డిసెంబర్ 27: జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు జూనియర్ బాల బాలికల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షురాలు సంధ్య తెలిపారు. మల్యాల మండలం నూకపెల్లి ప్రతిభ హైస్కూల్‌లో ఉదయం 11 గంటలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. వివరాలకు 73309 75823 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వేంకటేశ్వరస్వామి రథోత్సవం

కోరుట్ల రూరల్, డిసెంబర్ 27 : పట్టణ శివారులోని తాళ్ల చెరువు కింద వేంకటేశ్వరస్వామి (గుంటి పెరుమాండ్లు) జాతర రథోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేకపూజలు చేసి, ఉత్సవ మూర్తులను ముస్తాబు చేసి రథంపై ఉంచి రథోత్సవాన్ని నిర్వహించారు.

'ప్రజాపాలన'పై ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ సమీక్ష

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి పూల బొకేను అందజేస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 27 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన సన్నాహక సమావేశాన్ని కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన ఈ సన్నాహక సమావేశంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, సంజయ్ కల్వకుంట్ల, అడిషనల్ కలెక్టర్లు ఉన్నారు.

రెవెన్యూ, పంచాయతీ శాఖల పాత్రే కీలకం

ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, డిసెంబర్ 27: ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల పాత్ర కీలకమని పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో ఎమ్మె ల్సీ జీవన్‌రెడ్డిని పంచాయతీ కార్యదర్శులు కలిశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వోద్యోగులు, పాలన అధికారులు ఎవరైనా ప్రభుత్వ ఆలోచన విధానానికి అనుగుణంగా బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. నేటి నుంచి జనవరి 6వరకు గ్రామగ్రామాన ఆరు గ్యారెంటీల కోసం లబ్ధిదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తామన్నారు. ప్రజలు ఆరు గ్యారంటీలు కాకుండా ప్రభుత్వం నుంచి మరే ఇతర పథకం కోసమైతే వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. పెళ్లి కూతురుకి రూ.లక్షతో పాటు అదనంగా తులం బంగారం కోసం, అలా గే రేషన్ కార్డు లేనివారు విడిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ రెండు పథకాలు అందులో పేర్కొనలేదన్నారు. కేవలం 6 గ్యారంటీ పథకాల కోసమే ఈ దరఖాస్తు నమూనాను ముద్రించామన్నారు. ఆరు గ్యారంటీ పథకాల్లో పేర్కొనని వేరే లబ్ధిని ఆశించినట్లయితే విడిగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని అధికారులు ప్రజలకు వివరించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.

గణనీయంగా పెరిగిన సైబర్ క్రైమ్స్

- సమష్టి కృషితోనే అదుపులో శాంతి భద్రతలు
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 27: పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ క్రైమ్స్ సైతం గణనీయంగా పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే మొత్తం అన్ని విభాగాల కేసుల్లో ఒక శాతం తక్కువగా నమోదయ్యాయి. సమష్టి కృషి, పోలీసుల పారదర్శక పనితీరు వల్లే శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నూతన పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ 2023 సంవత్సరం నేర సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2023లో 5070 కేసులు నమోదయ్యాయన్నారు. గతాడేదితో పోలిస్తే కేసుల నమోదులో ఒక శాతం తక్కువగా నమోదయ్యాయన్నారు. 2022తో పోలిస్తే జిల్లాలో దొంగతనాలు 8శాతం తగ్గినప్పటికీ చోరీ చేసిన సొత్తు మాత్రం 16 శాతం పెరిగిందన్నారు. 325 దొంగతనాలు, 21 రాబరీలు, 32 హత్యలు, 48 కిడ్నాప్ కేసులు, 42 రేప్ కేసులు, 347 చీటింగ్ కేసులు, 66 హత్యాయత్నాలు, 438 రోడ్డు ప్రమాదాలు, 644 ఉమెన్ అగైనెస్ట్ కేసులు, 51,182 ఈ–చలాన్ కేసులు, 5,882 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయన్నారు. 2022లో 635 సైబర్ క్రైమ్ కేసులు నమోదు కాగా, ఈ యేడు 866 కేసులు నమోదయ్యాయన్నారు. ఈ యేడు రూ. 8.61కోట్లు నష్టం జరిగిందన్నారు. రూ. 5.07కోట్లు ఫ్రీజ్ చేశామన్నారు. గంజాయి అక్రమ రవాణాపై 13 కేసులు నమోదు చేయగా, అందులో 46 మందిని అరెస్ట్ చేశామన్నారు. 92 మందిపై హిస్టరీ షీట్స్ ఓపెన్ చేశామని, 12 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఎస్పీ అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- 3 నెలల క్రితమే సౌదీఅరేబియా నుంచి వచ్చిన నర్సయ్య

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 27: మూడు నెలల క్రితమే సెలవుపై సౌదీ అరేబియా నుంచి వచ్చాడు. మరికొన్ని నెలల్లో తిరిగి వెళ్లాల్సి ఉండేది. కానీ ఇంతలోనే రోడ్డు ప్రమాదం అతడిని బలి తీసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లికి చెందిన నక్క నర్సయ్య (45) ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన సౌదీఅరేబియా దేశానికి వెళ్లాడు. సెలవుపై మూడు నెలల క్రితం స్వంత గ్రామానికి వచ్చాడు. బుధవారం రాత్రి బైక్‌పై వేంపేట వైపు నుంచి మెట్‌పల్లి వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో మెట్‌పల్లి డిపోకు చెందిన బస్సు వేంపేట శివారులోని ఎస్వీఎస్ ఫంక్షన్‌హాల్ సమీపంలో బైక్, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నర్సయ్యకు భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

గొల్లపల్లి : మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి

అధైర్య పడొద్దు.. నేనున్నాను

- కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి, డిసెంబర్ 27: 'నేను ఓడిపోయానని కార్యకర్తలు, నాయకులు అధైర్య పడొద్దు.. మీ వెంటే నేనున్నాను' అంటూ వారికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మనోధైర్యానిచ్చారు. బుధవారం గొల్లపల్లికి వచ్చిన ఆయన స్థానికరెడ్డి సంఘం భవనంలో కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సాధారణమని, నేను ఓడిపోయినంత మాత్రాన కార్యకర్తలు పనిచేయలేదని ఎవ్వరిని తప్పు పట్టలేమన్నారు. ఎన్నికల్లో మనకు రావాల్సిన ఓట్లు వచ్చాయని, కొత్త ఓటర్లు మార్పును కోరుకొని ఉండవచ్చన్నారు. కార్యకర్తలకు ఏ అవసరమొచ్చిన జడ్పీటీసీ, ఎంపీపీ, పార్టీ మండలాధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు చూసుకోవాలని కోరారు. తాను ఓడినప్పటికీ తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిప్పారు.

దొంగమల్లన్నకు కొప్పుల ఈశ్వర్ మొక్కులు

గొల్లపల్లి /పెగడపల్లి, డిసెంబర్ 27: 'ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండేలా చూడు స్వామి' అంటూ గొల్లపల్లి మండలం మల్లన్నపేట దొంగమల్లన్న స్వామిని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వేడుకున్నారు. బుధవారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తన ఎత్తు బంగారం (బెల్లం తూకం వేసి) తులాభారం వేసి పంచి పెట్టారు. ఆలయ పూజారులు మాజీ మంత్రికి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. పెగడపల్లి మండలంలోని నర్సింహునిపేటలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అన్నారపు కనకయ్య ఇంట్లో బుధవారం జరిగిన మల్లన్న దేవుడి పెద్ద పట్నంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళి శోభా–సురేందర్‌రెడ్డి, సర్పంచులు బాబుస్వామి, రాజేశ్వర్‌రావు, కరుణాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ రాజు ఆంజనేయులు, నాయకులు నరేందర్‌రెడ్డి, సత్తయ్య, రాజశేఖర్, తిరుపతి, సంతోష్, అజయ్, మహేశ్ తదితరులున్నారు.

మల్లన్నకు హరిచరణ్‌రావు పూజలు

మేడిపల్లి, డిసెంబర్ 27: భీమారం మండల కేంద్రంలో సర్పంచ్ చెక్కపెల్లి అరుణ మల్లన్న పట్నాలు నిర్వహిస్తుండగా బుధవారం నాగవల్లి లగ్గంలో జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు కాచర్ల సురేశ్, ఈర్నాల సంపత్‌కుమార్, నాయకులు చెక్కపెల్లి రఘు, చెక్కపెల్లి మహేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జనవరి ఆరు వరకు 'ప్రజాపాలన'

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా • ధర్మపురిలో ప్రారంభించనున్న విప్ అడ్లూరి

జగిత్యాల కలెక్టరేట్/ధర్మపురి/ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 27: జిల్లాలో నేటి నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, చేయూత పథకాల లబ్ధికోసం ఆయా గ్రామ సభలు, మున్సిపల్ వార్డు సభల్లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమానికి గానూ గ్రామ సభలు, మున్సిపల్ వార్డుల్లో నిర్వహించే సభలకు కౌంటర్లు ఏర్పాటు చేసి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. కాగా నేటి నుంచి ప్రారంభించే ప్రజాపాలన కార్యక్రమాలపై జడ్పీ సీఈవో రఘువరన్ బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

సారంగాపూర్, డిసెంబర్ 27: మండలంలోని అర్పల్లి, ధర్మనాయక్‌తండా గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్రప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయుస్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజ న, పీఎంజీపీ, స్వచ్ఛభారత్, స్టార్టప్ ఇం డియా, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, ప్రధానమంత్రి జనధన్ యోజన, ప్రధానమంత్రి కిసాన్ సమ్మన్ నిధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు షోషన్ అభియాన్ ఉపయోగాలు, అంగన్‌వాడీల సేవల గురించి వివరించారు. కార్యక్రమాల్లో జిల్లా ఉప వైద్యాధికారి ఎన్ శ్రీనివాస్, మండల వైద్యాధికారి రాణిమైత్రిరెడ్డి, సర్పంచ్ కొండ శ్రీలత, సూపర్వైజర్ కిశోర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు

మారుతీనగర్, డిసెంబర్ 27: మెట్‌పల్లిలోని కోదండరామాలయం, చెన్నకేశవాలయం, వేంకటేశ్వరాలయాల్లో ధనుర్మాసోత్సవాలు బుధవారం కొనసాగాయి. భక్తులు గోదా రంగనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక పారాయణం, శ్రీమన్నారాయణ సంకీర్తలు చేశారు. కార్యక్రమాల్లో వేదపండితులు కృష్ణమాచారి, రమకాంతాచారి, శ్రీనివాస్‌స్వామి, సునంద, శ్రీకర్, శ్రీనివాస్, నర్సింహచారి, మొరం శెట్టి, రవీందర్, రాధ, లక్ష్మి పాల్గొన్నారు.

హెల్మెట్ల పంపిణీ

మల్లాపూర్, డిసెంబర్ 27: మండలంలోని ముత్యంపేటలో సుకుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉయ్యా ల సుకుమార్ ఐదో వర్ధంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. గ్రామాల్లోని కొంత మంది వాహనచోదకులకు హెల్మెట్లను అందజేశారు. అలాగే రక్తశిబిరాన్ని నిర్వహించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల రూరల్, డిసెంబర్ 27: జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గామ్ గ్రామానికి చెందిన కొమ్ముల రా జు నానమ్మ రాజవ్వ ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మృతి చెందింది. బుధవా రం ఆ కుటుంబాన్ని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

లచ్చవ్వ కుటుంబానికి సుంకె పరామర్శ

కొడిమ్యాల, డిసెంబర్ 27: మండలంలోని కొండాపూర్‌కు చెందిన గుండు లచ్చవ్వ మృతి చెందగా బుధవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ సామంతుల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొలపూరం రమేశ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు, వైస్ ఎంపీపీ ప్రసాద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశంగౌడ్, గడ్డం లక్ష్మారెడ్డి, తదితరులున్నారు.

పూడూర్ మండల సాధన జేఏసీ ఏర్పాటు

కొడిమ్యాల, డిసెంబర్ 27: మండలంలోని పూడూర్ గ్రామంలో మండల సాధన కమిటీ సభ్యులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూడూర్, నర్సింహులపల్లి, గౌరాపూర్, అప్పారావుపేట, నమిలకొండ, తుర్కాశీనగర్, శ్రీరాములపల్లి, తిప్పాయిపల్లి, నల్లగొండ, చెప్యాల గ్రామాల ప్రజలు సమావేశంలో పాల్గొని పూడూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని తీర్మానించారు. మండల కన్వీనర్‌గా పూడూర్ సింగిల్ విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, యూత్ కన్వీనర్‌గా రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు. త్వరలోనే మండల సాధన కోసం అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రం అందజేయాలని తీర్మానించారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

మల్లాపూర్, డిసెంబర్ 27: గ్రామాల్లోని ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర మహసభ కార్యదర్శి మైలారపు లింబాద్రి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కన్యకాపరమేశ్వరి ఆల య ఆవరణలో ఆర్యవైశ్య మహసభ సంఘం మండలాధ్యక్షుడిగా చౌదరపు శ్రీనివాస్, కార్యదర్శిగా సంగెం శ్రీనివాస్, కోశాధికారిగా మేడి శివకుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇక్కడ సంఘం నాయకులు మైలారపు రాంబాబు, శివ శ్రీనివాస్, రాంకిషన్, గంప శ్రీనివాస్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

మల్లాపూర్, డిసెంబర్ 27: మండలకేంద్రంతో పాటు కొత్తదాంరాజ్‌పల్లిలో అయోధ్యలో పూజించిన అక్షింతల కలశాల ఎదుర్కోలు శోభాయాత్రను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరామ కీర్తనలతో ఊరేగింపు చేశారు.